క్లుప్తంగా

నేడు యోగాపై అవగాహన

రెంటచింతల: ప్రిపేర్ నెస్ టు యోగ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల ఆడిటోరియంలో అధికారులకు, ప్రజా ప్రతి నిధులకు, ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె. సరోజినిదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో సచివాలయ, వివిధ కార్యాలయాల సిబ్బంది, ఎన్జీవోస్, విశ్రాంతి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మిక సంబంధిత ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

యోగ, ధ్యానంపై శిక్షణ..

క్రోసూరు: వేసవి విజ్ఞాన శిబిరంలో మంగళవారం చిన్నారులకు యోగ, ధ్యానంపై శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయ అధికారి వై.వీరాంజమ్మ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం, నీతి కథలు చెప్పటం, రాయటం, పుస్తక పఠనం, చెస్, క్యారమ్స్, స్కిప్పింగ్ వంటి ఆటలు నేర్పించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నట్లు గ్రంథాలయ అధికారి తెలిపారు. విద్యార్థులు వేసవి విజ్ఞాన శిబిరాలకు తప్పక హాజరు కావాలని ఆమె కోరారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

పిడుగురాళ్ల: పట్టణంలో జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆశ్విని హాల్‌లో యమదొంగ ప్రీమియర్ షో నిర్వహించి, కేక్ కట్ చేసి, అనంతరం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అదే విధంగా కొండమోడులోని దీనమ్మ అండ్ రూరల్ సొసైటీలో వృద్ధులు, అనాథ పిల్లలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు రామినేని మోహన్‌చౌదరి, గుదే విస్సు చౌదరి, రామినేని నవీన్, ముచ్చర్ల బాజీ, షేక్ ఇమ్రాన్, కంభంపాటి సత్యరాయణ, ఉదయ్‌కుమార్, చైతన్య, నాగుల్ పాల్గొన్నారు.

కాసు బ్రహ్మానందరెడ్డికి ఘన నివాళి

నరసరావుపేట ఈస్ట్: రాజకీయ దురంధరుడు కాసు బ్రహ్మానందరెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం కేబీఆర్ విద్యాసంస్థల సిబ్బంది ఆధ్వర్యంలో మెయిన్‌రోడ్డులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ సి.హెచ్.వి.నాగిరెడ్డి మాట్లాడుతూ, నాటి రాష్ట్ర ముఖ్యమంత్రిగా నాగార్జున సాగర్ నిర్మాణం చేపట్టి లక్షలాది ఎకరాలకు సాగునీటిని అందించటంతోపాటు ఈప్రాంత ప్రజల దాహార్తిని తీర్చారని తెలిపారు. కేంద్రమంత్రిగా, ముఖ్యమంత్రిగా ఎన్నో బాధ్యతాయుతమైన పదవులు నిర్వహించి దేశానికి సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటశివ, గ్రంథాలయాధికారి రామ్మోహనరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ నిరసన



వినుకొండ: ఏఐటీయూసీ ఆధ్వర్యంలో స్థానిక శివయ్య స్థూపం సెంటర్‌లో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి కార్మికులు సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కోడ్‌లుగా కుదించడం, కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడంలో ప్రభుత్వాలు వైఫల్యం చెందడం, విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయడం కోసం పన్నాగాలు పొందడం తదితర కార్మిక వ్యతిరేక విధానాలను అవలభిస్తుందన్నారు. వెంటనే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కొండ్రముట్ల సుభాని, రాయబారం వందనం, కొప్పరపు మల్లికార్జున, ఎస్కే మస్తాన్, వెంకటేశ్వర్లు, సుభాని పాల్గొన్నారు.

28న ఎరువుల వేలం

క్రోసూరు: క్రోసూరు మార్కెట్‌యార్డులోని అగ్రి ల్యాబ్‌లో పరీక్షించబడిన నాణ్యమైన ఎరువులను ఈ నెల 28వ తేదీన వేలం వేస్తున్నట్లు ఏడీఏ వి.హనుమంతరావు మంగళవారం తెలిపారు. 60.600 కిలోల యూరియా, కాంప్లెక్స్ ఎరువులను వేలం వేస్తున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని ఏడీఏ కోరారు.

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఆహ్వానం

సత్తెనపల్లి: నెల్లూరు ఏపీ పీపీడీ జోన్-3 పరిధిలోని వివిధ బస్ స్టేషన్లు, బస్సు డిపోల్లో ఖాళీగా ఉన్న 26 ప్రదేశాలను 15 సంవత్సరాలకు లీజు పద్ధతిలో అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పల్నాడు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.మధు మంగళవారం తెలిపారు. సత్తెనపల్లి బస్టాండ్‌లో 2 వేల చదరపు గజాలు, అచ్చంపేట బస్ స్టేషన్ పరిధిలో 1,597 చదరపు గజాలు, అమరావతి (బీట్-1) బస్సు స్టేషన్ పరిధిలో 3,872 చదరపు గజాలు, అమరావతి (బీట్-2) బస్సు స్టేషన్ పరిధిలో 6,582 చదరపు గజాలు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. పల్నాడు జిల్లా ప్రజా రవాణా అధికారి నరసరావుపేట కార్యాలయంలో 23వ తేదీ ఉదయం అవగాహన సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. వివరాలకు 9959225429లో సంప్రదించాలని కోరారు.

కేంద్రం లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

పిడుగురాళ్ల: కేంద్ర ప్రభుత్వం కార్పొరేటర్లకు లాభాలు చేకూర్చే లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పిడుగురాళ్ల పట్టణంలోని బ్యాంక్ సెంటర్ నుంచి కార్మిక, కర్షక సంఘాల ఆధ్వర్యంలో నల్ల కండువాలు ధరించి ఐలాండ్ సెంటర్ వరకు మంగళవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత లేబర్ కోడ్‌లను అమలు చేయడానికి దూకుడుగా వ్యవహరిస్తుందని, తాము వస్తే మంచి రోజులు వస్తాయని చెప్పి ఆచరణలో రైతులకు, కార్మికులకు కష్టాలు తెచ్చే రోజులు తీసుకొచ్చిందన్నారు. బ్రిటీష్ కాలం నుంచి పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి, పనిగంటలు పెంచి, ఇతర సౌకర్యాలను రద్దు చేసే విధానాలను తీసుకోవడం కార్మిక హక్కులను కాలరాయటమేనని వారు విమర్శించారు. ఢిల్లీలో రైతాంగం పోరాడి నల్ల చట్టాలను రద్దు చేసుకున్నారని ఈ సందర్భంగా రైతులకు క్షమాపణ చెప్పిన మోదీ నేడు దొడ్డిదారిన మళ్లీ అవే విధానాన్ని అమలు చేయడం వ్యవసాయ రంగాన్ని దెబ్బతీయటమేనని పేర్కొన్నారు. భవిష్యత్‌లో వ్యవసాయ రంగంలో స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలని, కార్మిక చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలని, కేంద్ర ఉపాధి హామీ పథకంలో 200 రోజులు పని దినాలు పెంచి, పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని ఈ పథకాన్ని పట్టణ ప్రాంతానికి విస్తరించాలని తదితర డిమాండ్ల సాధన కోసం కార్మికులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు, ఏఎఫ్‌టీయూ న్యూ నాయకులు కొండారెడ్డి చెన్నయ్య, సీఐటీయూ నాయకులు ఓర్సు కృష్ణ, రైతు సంఘం నాయకులు స్వామి, దీకొండ వెంకటేశ్వర్లు, షేక్ బాబు, వెంకయ్య, నాగేశ్వరరావు, సైదావలి, కృష్ణ, గుంటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

•బోరుమంటున్న బావులు


రెంటచింతలలో చెత్తాచెదారంతో నిరుపయోగంగా ఉన్న బావి

గ్రామీణ ప్రాంతాల్లో బావులకు ప్రాధాన్యం ఉంది. పెద్దలకు ఇంటి వద్దనే ఉంటే పేదలందరికీ కలిపి ఒకటి ఉండేది. తాగునీటికి వినియోగించేవారు. రానురాను మోటార్లు వచ్చాయి. వీటికి తోడు రక్షిత తాగునీటి పథకంలో భాగంగా ఇంటింటికి తాగునీటి సరఫరాకు ప్రభుత్వాలు చర్యలు తీసుకున్నాయి. దీంతో బావులకు ప్రాధాన్యం తగ్గిపోయింది. అక్కడక్కడ దేవాలయాలు, ఊరు ఉమ్మడి స్థలాల్లో దర్శనమిస్తున్నాయి. వాటిని వినియోగించకపోవడంతో వ్యర్థాలతో నింపుతున్నారు. బావులకు మరమ్మతులు చేయిస్తే కుళాయి నీరు రాని సమయంలో ఉపయోగపడతాయని, క్లోరినేషన్ చేయించాలని పలువురు గ్రామ ప్రజలు కోరుతున్నారు.

– రెంటచింతల

దేవుని విగ్రహాలు ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

సత్తెనపల్లి: శ్రీకాకుళం జిల్లాలో ఏడు దేవుని విగ్రహాలు ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్‌ఎస్‌ఎస్ ఖండ సంఘ చాలక్, సీనియర్ న్యాయవాది చలువాది చిన సత్యనారాయణ డిమాండ్ చేశారు. పట్టణంలోని కోటమ్మ సత్రంలో మంగళవారం జరిగిన సత్తెనపల్లి, పెదకూరపాడు ఆర్‌ఎస్‌ఎస్ ఖండ సంఘ చాలక్ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. శ్రీకాకుళం జిల్లాలోని గార మండలం, కళింగపట్నం పెదపల్లి పేటలోని కోదండ రామాలయంలో బాల శశి శేఖర్ (వైష్ణవ ఆలయం) గుర్తు తెలియని వ్యక్తులు ఏడు విగ్రహాలు ధ్వంసం చేశారని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఘటనకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దేవాలయాలకు, దేవతామూర్తుల విగ్రహాలకు తగిన రక్షణ కల్పించాలన్నారు. ప్రభుత్వం దేవాలయాలను కేవలం ఆదాయ వనరులుగా చూస్తోందని, వాటికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సమావేశంలో నాయకులు దివ్వెల శ్రీనివాసరావు, జి.శ్రీనివాసరావు, కొర్రప్రోలు నగరీనారాయణ, శివకుమార్, అన్నం వెంకటరమణ, పెండ్యాల హరేరామ్, పోతుగడ్డ కృష్ణమోహన్ ఉన్నారు.

ప్రారంభమైన హనుమత్ జయంతి వేడుకలు



నాదెండ్ల: మండలంలో హనుమత్‌జయంతి వేడుకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. కోదండ రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపవరం కోదండ రామాలయంలో ఉన్న ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకాలు, గోత్రనామ పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి దర్భి ఉమామహేశ్వరశర్మ, అనిల్‌కుమార్‌శర్మలు స్వామివారిని అలంకరించి అభిషేకాలు నిర్వహించారు. గ్రామంలోని రాంనగర్‌లో కొలువైయున్న కోదండ రామాలయంలో ఆంజనేయస్వామికి లక్ష మల్లెలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సిందూరార్చన చేశారు. ఆలయ పూజారి చింతలపూడి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ నెల 22న హనుమత్‌జయంతి సందర్భంగా అన్నదానం చేయనున్నారు.

కళ్లు తెరిపించి.. రైలుభోగి కష్టం చూపించి..

ఆకట్టుకున్న నాటిక ప్రదర్శనలు


నాటికలోని ఓ సన్నివేశం


చిన్నారులను అభినందిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ

వినుకొండ: ఎన్టీఆర్ జయంతి పురస్కరించుకొని నందమూరి తారక రామారావు కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన నాటిక ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. పట్టణంలోని జూనియర్ కళాశాలలో తొలిరోజు సోమవారం రాత్రి ముప్పాళ్ళ చెన్నయ్య, రాపర్ల శ్రీనివాసరావు కళా ప్రాంగణంలో శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ చైర్మన్ జి.లీలావతి జ్యోతి ప్రజ్వలన చేయగా ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు నటరాజ పూజ చేసి ప్రదర్శనలకు శ్రీకారం చుట్టారు. నాటక ప్రదర్శనలకు డీఎల్‌డీఏ మాజీ చైర్మన్ లగడపాటి వెంకట్రావు, న్యాయవాది ముప్పాళ్ళ జ్ఞానేశ్వరావు వారి కుటుంబ సభ్యులకు ప్రోత్సాహిక పారితోషికాన్ని అందేశారు. సందేశాత్మకంగా భార్య మాటలు విని కన్న ప్రేమను మరిచిన కొడుక్కి కళ్ళు తెరిపించిన తల్లిదండ్రుల ఇతివృత్తంగా కిడ్నాప్ నాటిక సాగింది. ఉషోదయ కళా నికేతన్ కాట్రపాడుకు చెందిన కళాకారులు పోటీపడి నటించారు. చెరుకూరి సాంబశివరావు దర్శకత్వం వహించారు. కొలకలూరి శ్రీ సాయి ఆర్ట్స్ ఆధ్వర్యంలో జనరల్ భోగీలు నాటిక రైళ్లలో సామాన్య ప్రయాణికులు కష్టాలను కళ్లకు కట్టింది మాధవ్ రచించిన గోపరాజు విజయ్ దర్శకత్వం వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు ముత్తినేని గిరిబాబు, బొల్లా వెంకట కోటయ్య, జ్ఞానేశ్వరరావు, రామకోటేశ్వర రావు, కౌన్సిలర్ షకీలా బేగం, పీవీ సురేష్ బాబు, జనసేన పార్టీ నాగ శ్రీను రాయల్, మందా మరియదాసు, గాలి రేవతి శ్రీనివాసరావు, పెనుగొండ శ్రీనివాసరావు, లాయర్, సైదారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు చేరిన పాఠ్యపుస్తకాలు


నాదెండ్ల జెడ్పీ హైస్కూలులో చేర్చిన పుస్తకాలు

నాదెండ్ల: ప్రభుత్వ పాఠశాలలకు రానున్న విద్యా సంవత్సరానికి పాఠ్య పుస్తకాలు చేరాయి. పుస్తకాలను నాదెండ్ల జెడ్పీ హైస్కూలులో నిల్వ చేశారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కానుక ద్వారా 1-10వ తరగతుల వరకూ 25,032 పాఠ్య పుస్తకాలు అవసరం కాగా, ఇప్పటికీ 18,305 పుస్తకాలు అందాయి. మిగిలిన 6,627 పుస్తకాలు నెలాఖరు నాటికి అందుతాయని ఎంఈవో-2 ఈమని కృష్ణారెడ్డి తెలిపారు. మండలంలో 48 ప్రాథమిక, 4 ప్రాథమికోన్నత, 9 జిల్లా పరిషత్, నాదెండ్ల కస్తూర్బా గాంధీ, చిరుమామిళ్ళ ఏపీ మోడల్ పాఠశాలలకు గాను ఈ ఏడాది 5,135 బ్యాగులు అవసరం కాగా, మొత్తం చేరాయి. పాఠశాలలు జూన్ 12న పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో యూనిఫాం, షూలు, నోట్ పుస్తకాలు పంపిణీ చేయనున్నారు.

బహుజన వాదాన్ని వినిపిస్తున్న యోధుడు కొరబండి


ఆంథోని దంపతులను సత్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

సత్తెనపల్లి: ఓ పక్క ఆర్టీసీ అధికారిగా పనిచేస్తూనే మరో పక్క తన కవితలతో సామాజిక రుగ్మతలపై ప్రజల్ని చైతన్యవంతుల్ని చేస్తూ బహుజన వాదాన్ని రాష్ట్ర వ్యాప్తంగా వినిపిస్తున్న యోధుడు కొరబండి ఆంథోని అని విశ్రాంత డీఎస్పీ గంటెల రవికుమార్ అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కత్తి పద్మారావు ప్రధాన అనుచరుడిగా, దళిత మహాసభ ఉపాధ్యక్షుడిగా ఎన్నో సామాజిక ఉద్యమాలను తనదైన శైలిలో కొరబండి చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దళిత, బహుజన వర్గాల సమస్యలపై పాలకులను నేటికీ ప్రశ్నిస్తూ దళితులకు అండగా నిలుస్తున్నారన్నారు. అరండల్ పేట సీఐ కొరబండి ఆరోగ్యరాజు, న్యాయవాదులు దాసరి జ్ఞాన్‌రాజ్‌పాల్, జొన్నలగడ్డ విజయకుమార్, సయ్యద్ అబ్దుల్ రహీం, పెండెం బాబూరావు, గాదెవరపు శివనాగేశ్వరరావు, మాదంశెట్టి వేదాద్రి, విశ్రాంత ఉపాధ్యాయుడు కె.బి.ఆర్.జె.ప్రసాద్, లక్ష్మీనారాయణ, మాతంగి సాంబశివరావులు మాట్లాడారు. అనంతరం కొరబండి ఆంథోని, విజయలక్ష్మి దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు జిల్లెళ్ల పాల్‌రాజ్, షేక్ మస్తాన్‌వలి, హైదర్, చాంద్‌బాషా, ఎన్.పి.ప్రసాద్, గొట్టిముక్కల కిషోర్, జడా ప్రసాద్, జెట్టి శేఖర్, కొరబండి రాంబాబు, స్వాతి, నలబోలు రాజా ఉన్నారు.

నిస్వార్థపరుడు ఏపీ తొలి ముఖ్యమంత్రి టంగుటూరి

సత్తెనపల్లి: ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు నిస్వార్థపరుడని బ్రాహ్మణ సేవా సంఘ నాయకులు కొనియాడారు. పట్టణంలో మంగళవారం ప్రకాశం పంతులు వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు పీ హనుమంతరావు, ఎం.నరేంద్రకుమార్, పూర్ణచంద్ర ప్రసాదరావు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి


అదాలత్‌లో మాట్లాడుతున్న విశ్రాంత న్యాయమూర్తి విక్టర్ ఇమ్మానియేల్

దాచేపల్లి: వినియోగదారులకు నాణ్యమైన కరెంట్ ఇచ్చేందుకు కృషి చేయాలని విశ్రాంత సెషన్స్ జడ్జి ఎస్. విక్టర్ ఇమ్మానియేల్ కోరారు. స్థానిక విజయ భాస్కర్ కల్యాణ మండపంలో విద్యుత్ అదాలత్, వినియోగదారులకు అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. సమస్యలపై వినియోగదారులు పది అర్జీలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. నాణ్యమైన విద్యుత్‌ని సరఫరా చేసి వినియోగదారుల మన్ననలను పొందాలని, విద్యుత్ సమస్యలపై వినియోగదారుల నుంచి వినతిపత్రాలు వచ్చినప్పుడు తక్షణమే స్పందించాలని సూచించారు. సదస్సులో సాంకేతిక కమిటీ సభ్యులు ఎస్.శ్రీనివాసరావు, ఆర్థిక సభ్యులు ఆర్ సీహెచ్ శ్రీనివాసరావు, స్వతంత్ర సభ్యురాలు ఎ.సునీత, పల్నాడు జిల్లా ఎస్ఈ పి.విజయ్‌కుమార్, ఈఈ నూతలపాటి సింగయ్య, ఏడీఈ వీరేశ్వరరావు, ఏఈలు భగవాన్‌నాయక్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కనుల పండువగా శాంతి కల్యాణోత్సవం


స్వామివారి శాంతి కళ్యాణమహోత్సవాన్ని కనుల పండువగా జరిపిస్తున్న అర్చకులు

రెంటచింతల: స్థానిక మల్లేశ్వరస్వామి దేవస్థానం(శివాలయం) వార్షికోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు వెల్లటూరి నాగేశ్వరశర్మ నేతృత్వంలో ఉదయం స్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, 10 గంటలకు లక్ష మల్లెలార్చన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో చేపట్టారు. 11 గంటలకు స్వామివార్ల శాంతి కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా జరిపించారు. మధ్యాహ్నం మంత్రపుష్పం, మంగళహారతి కార్యక్రమాలను నిర్వహించి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులకు ఈఓ గాదె రామిరెడ్డి, దేవస్థానం అధ్యక్షులు పల్లెర్ల లక్ష్మారెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీడీఓ కె.సరోజినిదేవి పాల్గొని భగవద్గీత బంగారు పతకం పొందిన అమరనేని రమాదేవినిదుశ్యాలవతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గుండా రామ్మూర్తి, యేచూరి కేదర్‌నాథ్, సైదారెడ్డి, సైదులు, యేచూరి నర్సింహారావు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత టంగుటూరి ప్రకాశం పంతులు


టంగుటూరి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ మోహన్

రెంటచింతల: మద్రాసులో సైమన్ కమిషన్‌కు వ్యతిరేక ప్రదర్శనలో పాల్గొని బ్రిటీష్ వారి తుపాకీకి గుండెను చూపి ఆంధ్రకేసరిగా కీర్తిప్రతిష్టలు పొందిన టంగుటూరి ప్రకాశం పంతులు నేటి తరానికి స్ఫూర్తి ప్రదాత అని స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సింహాద్రి మోహన్ అన్నారు. పాఠశాలలో ప్రకాశం పంతులు వర్ధంతి మంగళవారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ అధ్యక్షులు నారాయణ పురం శ్రీనివాసరావుతో కలసి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమర యోధుడు, ఆంధ్రరాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రి ప్రకాశం పంతులు త్యాగం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో కానాల శివ, కాశీ, వై.శ్రీనివాసరావు, జి.వెంకటేశ్వర్లు, పి.చిన్న అంకారావు, నాజర్ పాల్గొన్నారు.

పేదలకు ఉచిత న్యాయ సాయం


సబ్ జైలులో నిత్యావసరాలు పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి జియావుద్దీన్

సత్తెనపల్లి: ముద్దాయిలు సత్ప్రవర్తనతో జీవించాలని గుంటూరు జిల్లా న్యాయ సేవాధికార కమిటీ కార్యదర్శి జియావుద్దీన్ అన్నారు. సత్తెనపల్లిలోని ఉపకారాగారాన్ని మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార కమిటీ కార్యదర్శి, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) జియావుద్దీన్ సందర్శించారు. ముందుగా ఉపకారాగారంలోని పరిసరాలను, ముద్దాయిలకు అందుతున్న ఆహార పదార్థాలు, ముడిసరుకుల నాణ్యత పరిశీలించారు. అనంతరం రికార్డులు తనిఖీ చేశారు. అక్కడ ఉన్న ముద్దాయిలకు అందుతున్న సౌకర్యాలను ఆహారం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి జియావుద్దీన్ మాట్లాడుతూ న్యాయవాదిని నియమించుకునే ఆర్థిక స్థోమత లేని వారికి ప్రభుత్వం న్యాయ సహాయం అందించేందుకు న్యాయవాదిని ఉచితంగా నియమిస్తుందన్నారు. బెయిల్ పిటిషన్ వేసుకునే ఆర్థిక స్థోమత లేని కొందరు ముద్దాయిల కేసు విత్‌డ్రా, వారు ఎన్నిరోజులుగా రిమాండ్ ముద్దాయిలుగా ఉంటున్నారనే వివరాలు అడిగి తెలుసుకోవడమే కాక, వారికి న్యాయ స్థానమే ఉచితంగా ప్రభుత్వ న్యాయ సహాయ న్యాయవాదిని నియమిస్తుందన్నారు. న్యాయమూర్తితోపాటు, ప్యానల్ న్యాయవాది బి.ఎల్.కోటేశ్వరరావు, పారా లీగల్ వలంటీర్ షేక్ సుభాని, సబ్ డివిజన్ సూపరింటెండెంట్ వెంకటరత్నం తదితరులు ఉన్నారు.

ఉద్యోగుల సంఘం వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘం రాష్ట్ర 3వ కౌన్సిల్ మహాసభల వాల్ పోస్టర్‌ను మంగళవారం సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు స్వర్ణ చినరామిరెడ్డి, ప్రభుత్వ ఉద్యోగుల, ఉపాధ్యాయ పెన్షనర్ల ఐక్యవేదిక అధ్యక్షుడు పఠాన్ బాజీ ఆవిష్కరించారు. కలెక్టర్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జూన్ 5వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న మహాసభలను జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జాయింట్ కలెక్టర్ సూరజ్ గగోరెకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీపీఎస్ ఉద్యోగ సంఘం అధ్యక్షులు శాంతిబాయి, ఏసీజీఈఏ కార్యదర్శి చుక్క వెంకటేశ్వర్లు, జి.వందనం బాబు, తాలూకా అధ్యక్షురాలు ఎం.ఫ్లోరెన్స్ పాల్గొన్నారు.

మిర్చి, పొగాకు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి


వీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

నకరికల్లు: మిర్చి, పొగాకు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కౌలు రైతు సంఘం మండల అధ్యక్షుడు జి.పిచ్చారావు డిమాండ్ చేశారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించకపోవడంపై మండలంలోని చేజర్ల గ్రామ సచివాలయం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. వ్యవసాయం పట్ల ప్రభుత్వ తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. గిట్టుబాటు ధరలు కల్పించాలంటూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ వీఆర్వోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పిచ్చారావు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధరకు రైతులు అమ్ముకున్న ధరకు మధ్య వ్యత్యాసాన్ని తేల్చి రైతులకు చెల్లించాలన్నారు. ఈ క్రాప్ ఆధారంగా మిర్చి రైతులకు రూ.5 వేలు బోనస్ ఇవ్వాలన్నారు. కౌలు రైతులను గుర్తించాలని, అన్నదాత సుఖీభవ రూ.20 వేలు ఒకేసారి రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. ఉపాధి హామీ పథకంలో పనిదినాలు పెంచాలని, పెండింగ్ వేతనాలు సత్వరమే చెల్లించాలని, అలవెన్స్‌లు ఇవ్వడంతో పాటు అవినీతిని అరికట్టాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకం విధి విధానాలను స్పష్టంగా ప్రకటించాలన్నారు. బర్లీ పొగాకు మొత్తాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని పంటలను మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో చట్టు కోటేశ్వరరావు, ఆర్.వెంకయ్య, ఎస్.రామాంజినాయక్, బి.సోమ్లానాయక్, కోటేశ్వరమ్మబాయి తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువలకు మరమ్మతులు చేయించాలి

వినుకొండ: బ్రాహ్మణపల్లి విఠంరాజుపల్లి పంటకాలవను వెంటనే బాగు చేయాలని కాలవ వద్ద రైతులు మంగళవారం నిరసన చేపట్టారు. విఠంరాజుపల్లి శివారు రైలు పట్టాల దగ్గర ఎన్నెస్పీ పంటకాలవ పరిశీలించి రైతులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. 50 సంవత్సరాల నుంచి ఈ కాలువ మరమ్మతులకు నోచుకోలేదని అధికారులకు ఎన్నిసార్లు అర్జీలు పెట్టిన మా మొర ఆలకించట్లేదని రైతుల ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు స్పందించి బ్రాహ్మణపల్లి, విఠంరాజుపల్లి పంటకాలవను తక్షణమే మరమ్మతులు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.